
సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం | 12 | ఏప్రిల్ | 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



రూ.1.11 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగల కాశీ విశ్వేశ్వరరెడ్డి దంపతులు (రావులపాలెం) రూ.1,11,116 విరాళం సమర్పించారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	22.0
కాకినాడ	35.7	24.1
అమలాపురం	36.5	25.0

న్యూస్‌రీల్

ఫ్లాష్.. ఫ్లాష్..

రూ.5.60 కోట్ల సొత్తు స్వాధీనం

- లాజిస్టిక్ వాహనంలో బంగారం, వెండి వస్తువుల రవాణా
- పెద్దాపురంలో పట్టుకున్న పోలీసులు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం పోలీసులు సుమారు రూ.5.60 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ జేవీఎస్ రామారావు కథనం ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి బీవీసీ లాజిస్టిక్స్‌కు చెందిన వాహనంలో సుమారు 8.116 కేజీల బంగారు, 46 కేజీల వెండి వస్తువులు పట్టుబడ్డాయి. కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తూ, పెద్దాపురంలోని ఓ నగల దుకాణం నుంచి వెండి వస్తువులు తీసుకుని వెళ్తుండగా పోలీసులు అనుమానంతో ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో విషయం బట్టబయలైంది. పట్టుబడిన సొత్తుకు సరైన ఆధారాలు చూపలేదు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఆర్‌ఓ కార్యాలయానికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎకరాకు 50 బస్తాల ధాన్యం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సోమరాజు, రైతులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలో అధికారులు రెండు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కొవ్వూరు ఉపగణాంక అధికారి పి.సోమరాజు ఈ ప్రయోగాలను పరిశీలించారు. బుద్ధాల సురేష్ పొలంలో పీఆర్–126 రకం వరి అత్యధికంగా 50 బస్తాలు పండిందని తెలిపారు. అలాగే, వనమల వీరబాబు పొలంలో ఎంటీయూ–1121 రకం కూడా బాగా పండిందని చెప్పారు. సమయానికి మందులు వాడుతూ, శ్రద్ధ తీసుకోవడంతో బుద్ధాల సురేష్ 50 బస్తాల ధాన్యం దిగుబడి సాధించారని సహాయ గణాంక అధికారి జోడాల వెంకట్ చెప్పారు.

కూటమి సమావేశానికి కిరాయికి రాలేదని ఆటో ధ్వంసం

ఉండ్రాజవరం: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సమావేశానికి కిరాయికి రాలేదని టీడీపీ, జనసేన కార్యకర్తలు ఓ ఆటోను ధ్వంసం చేసిన సంఘటన ఇది. బాధితుడి కథనం ప్రకారం.. నిడదవోలులో బుధవారం సాయంత్రం జరిగిన విపక్ష కూటమి సభకు ఆటో పెట్టాలని మండలంలోని కాల్దారి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కట్టా శ్రీనును టీడీపీ, జనసేన కార్యకర్తలు కోరారు. వేరే కిరాయి ఉండటంతో రాలేనని అతడు చెప్పాడు. ఈ నేపథ్యంలో నిడదవోలు కూటమి సభ ముగిసిన తరువాత రాత్రి మద్యం తాగిన టీడీపీ, జనసేన కార్యకర్తలు శ్రీను ఆటోను ధ్వంసం చేశారు. ఆటోలోని సీట్లు, కవర్లు చింపడంతో పాటు ఆటో చుట్టూ ఆ పార్టీల జెండాలు చుట్టి వికృత ఆనందం పొందారు. రెక్కాడితేనే కానీ డొక్కాడని తనకు ఆ ఆటోయే జీవనాధారమని, వారి దాడిలో సుమారు రూ.40 వేల నష్టం జరిగిందని శ్రీను వాపోయాడు. అతడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై విచారణ చేపడతామని ఉండ్రాజవరం ఎస్సై అప్పలరాజు చెప్పారు.

పూలే సేవలు చిరస్మరణీయం



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి, నాటి పరిస్థితులకు ఎదురొడ్డి, సమాజంలో మార్పు కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జేసీ గురువారం పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యాలను, ఆశయాలను ఆచరణలో పెట్టడంలో పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, వివిధ శాఖల అధికారులు పి.రమేష్‌బాబు, ఎం.సందీప్, కేఎస్ జ్యోతి, ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వేరు కుంపటి

- పురందేశ్వరి రూటే సెపరేటు
- అన్ని హంగులతో ఉన్న భవనం కాదని మరోచోట మకాం
- తన అనుయాయులకే పెద్దపీట
- సోము వీర్రాజుకు చెక్ పెట్టేందుకే?
- ఆమె వ్యవహార శైలితో కేడర్‌లో కలవరం

సాక్షి, రాజమహేంద్రవరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కేడర్‌ను కాదని తన సొంత ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారా? ఆమె తీసుకుంటున్న నిర్ణయాలతో కేడర్ ఇబ్బంది పడుతోందా?, బీజేపీ సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును పూర్తిగా పక్కన పెట్టేసినట్టేనా?... వీటన్నింటికీ అవుననే సమాధానం వస్తోంది. తాజాగా... రాజమహేంద్రవరంలో అన్ని హంగులతో ఉన్న పార్టీ కార్యాలయాన్ని కాదని, వేరే భవనాన్ని ప్రారంభించడం, ఈ భవన ప్రారంభోత్సవానికి సోము వీర్రాజు గైర్హాజరు కావడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. బీజేపీకి రాజమహేంద్రవరంలో మూడు అంతస్తుల భవనం ఉంది. రాష్ట్రంలోని ఆ పార్టీ కార్యాలయాల్లోనే ఇదే అతి పెద్దది. చాలా కాలంగా పార్టీ కార్యకలాపాల కోసం దీన్నే ఉపయోగిస్తున్నారు. సమావేశాలు, ప్రెస్‌మీట్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. పురందేశ్వరికి టికెట్టు ఖరారయ్యాక ఈ భవనంలో ప్రత్యేక గదిని సైతం కేటాయించారు. ఇలా అన్ని వసతులతో అందుబాటులో ఉన్నప్పటికీ ఆమె దీన్ని పక్కన పెట్టేసి ప్రత్యేకంగా మరో కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ నేతలతో సమావేశాలు, ఎన్నికల వ్యూహాలు, ప్రెస్‌మీట్లు అన్ని ఇక్కడి నుంచే నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎప్పటి నుంచో ఉన్న పాత కార్యాలయం వెలవెలబోతోంది. పాత కార్యాలయంలో ఉంటే తన కదలికలు, రాజకీయ వ్యూహాలు, సోము వీర్రాజు వర్గీయులు పసిగట్టేస్తారనే ఆలోచనతోనే ఆమె ఇలా ప్రత్యేక మకాం పెట్టినట్లు తెలుస్తోంది.



రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంటరీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో కానరాని సోము వీర్రాజు (ఫైల్)



రాజమహేంద్రవరంలో పురందేశ్వరి ఏర్పాటు చేసిన బీజేపీ పార్లమెంటరీ కార్యాలయ భవనం

అజ్ఞాతంలోకి సోము వీర్రాజు

పార్టీలో సోము వీర్రాజుకు ప్రాధాన్యం తగ్గించేందుకే పురందేశ్వరి సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీలో సీనియర్ నేత, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇలా పలు హోదాల్లో కొనసాగిన సోము వీర్రాజు రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లో ఏదో ఒక స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించారు. ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం దక్కితే తాను ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భావించిన పురందేశ్వరి.. తెర వెనుక రాజకీయం నడిపి, సోముకు అడ్డుకట్ట వేశారు. మరోవైపు సోముపై అభిమానం చూపుతున్నట్లు నటిస్తూ, అనపర్తి నుంచి పోటీ చేయాలంటూ ఉచిత సలహా ఇచ్చారు. అందుకు సోము వీర్రాజు అంగీకరించలేదు. రాజమహేంద్రవరం ఎంపీ టికెట్టు లాంఛనమే అనే నమ్మకం కుదిరినప్పటి నుంచీ పురందేశ్వరి స్థానికంగా ఉన్న పార్టీ కేడర్‌ను పక్కన పెట్టి తన సొంత మనుషులను రంగంలోకి దింపారు. నెల రోజులు ముందుగానే నగరంలోని రెండు ప్రైవేటు హోటళ్లలో బస చేసిన ఆమె అనుయాయులు పార్టీ కార్యక్రమాలను శాసించే స్థాయికి చేరుకున్నారు. ఈ పరిణామాలను గమనించిన సోము వీర్రాజు ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీలో జరిగిన అన్యాయంతో మానసికంగా కుంగిపోయి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరం 9వ వార్డులో పురందేశ్వరి నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సైతం సోము వీర్రాజు గైర్హాజరయ్యారు. కొంత కాలంగా జరుగుతున్న ఈ పరిణామాలపై వీర్రాజు వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పురందేశ్వరికి సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు.



సోము వీర్రాజు

నేడు ఇంటర్ ఫలితాలు



- ఉత్కంఠతో ఎదురు చూస్తున్న విద్యార్థులు
- గతేడాది 6, 7 స్థానాలు దక్కించుకున్న జిల్లా
- ఈసారి మరింత ముందుకు దూసుకెళ్లేనా!

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. దీంతో విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అలాగే జిల్లా ఏ స్థానంలో నిలుస్తుందోనని ఇంటర్ బోర్డు అధికారులు ఎదురు చూస్తున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు గత నెల ఒకటో తేదీన ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 127 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరం 21,366 మంది, రెండో సంవత్సరం 20,016 మంది కలిపి మొత్తం 41,382 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పరీక్షలపై వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసం పెంచే దిశగా 'జయీభవ సంకల్ప' పేరిట ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. 'జయీభవ సంకల్ప' శిక్షణలో విద్యార్థుల ప్రతిభపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత ఏడాది 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈసారి 100 శాతం ఫలితాలు సాధించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం 50 రోజుల పాటు మెరుగైన బోధన, శిక్షణ అందించారు. నైతికత, మానవీయ విలువలు, పర్యావరణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్ పాసైనట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. గత ఏడాది ఫలితాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు రాష్ట్రంలో 6, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7 స్థానాల్లో జిల్లాను నిలబెట్టారు. ఈసారి మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని ఇంటర్ బోర్డు అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద ఆధ్వర్యాన ఆర్‌ఐఓ నరసింహం, ఆయా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ప్రణాళికతో కృషి చేశారు.

ఎదురు చూస్తున్నాం



విద్యార్థులు సాధించే ఉత్తమ ఫలితాలే మాకు సంతోషాన్నిస్తాయి. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కళాశాలల్లోని అధ్యాపకులు కృషి చేశారు. ఫలితాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. మంచి ఫలితాలు రాకపోయినా, ఉత్తీర్ణత సాధించకపోయినా ఎవ్వరూ నిరాశ పడవద్దు. ఈ మార్కులే జీవితం కాదు. క్షణికావేశాలకు లోను కాకుండా, మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలనే పట్టుదల పెంచుకోవాలి.

– ఐ.శారద, ఆర్‌జేడీ, ఇంటర్మీడియెట్ బోర్డు

ఈవీఎం స్ట్రాంగ్ రూము తనిఖీ



ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న రామ్ మోహన్ మిశ్రా తదితరులు

- సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం పరిశీలన
- అధికారులు, సిబ్బంది పని తీరుపై ఎన్నికల పరిశీలకుని సంతృప్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరంలోని ఈవీఎం గోడౌన్‌ను రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు రామ్ మోహన్ మిశ్రా గురువారం తనిఖీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి లాలాచెరువు వద్ద ఎఫ్‌సీఐ గోడౌన్లలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లను ఇక్కడ భద్రపరిచామని తెలిపారు. వీటికి ఈ నెల 12, 13 తేదీల్లో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఈవీఎంలు, అనుబంధ యూనిట్ల భద్రతకు తీసుకున్న చర్యలను వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడిన అనంతరం మిశ్రా అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కూడా మిశ్రా పరిశీలించారు. సువిధ తదితర విభాగాల్లో రికార్డుల నిర్వహణపై, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు వివిధ విభాగాల పని తీరు, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతికూల వార్తలు, సంఘటనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై అధికారులు చేపడుతున్న చర్యలను సమగ్రంగా తెలుసుకున్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం

- ఆర్యవైశ్యులు సమస్యలు పరిష్కరించుకుందాం
- రూరల్‌లో చెల్లుబోయిన వేణు విజయానికి తోడ్పాటునిద్దాం
- మన అభివృద్ధికి బాటలు వేసుకుందాం
- ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం, చిత్రంలో మంత్రి చెల్లుబోయిన వేణు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను గెలిపించుకుని, నియోజకవర్గపరంగా ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించుకునేందుకు బాటలు వేసుకుందామని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. రివర్ బే హోటల్ ఆహ్వానం ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ఆర్యవైశ్యులకు రాజకీయపరంగా తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు తనకు చిరకాల మిత్రుడన్నారు. గతంలో రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు కృషి చేయగా.. నేడు ఆయన ఆశయాలను కొనసాగించడానికి శిష్యుడు వేణు ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని చెప్పారు. ఆయనను గెలిపించుకుంటే నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకున్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకునేందుకు, కోరికలను సాధించుకునేందుకు వీలవుతుందని అన్నారు. తాను ఎప్పటిలానే ఆర్యవైశ్యుల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానన్నారు. వారు ఏ సమస్యతో వచ్చినా అక్కున చేర్చుకుని పరిష్కరించాలని వేణును శివరామ సుబ్రహ్మణ్యం కోరారు.

అనంతరం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, శివరామ సుబ్రహ్మణ్యం సూచనల మేరకు ఆర్యవైశ్యులను సొంత కుటుంబ సభ్యుల మాదిరిగా చూసుకుంటానని అన్నారు. తాను ప్రతి రోజూ పూజ్య బాపూజీ చిత్రపటానికి నమస్కరించనిదే బయటకు వెళ్లనని చెప్పారు. తనను విజయానికి సహకరిస్తే ఆర్యవైశ్యుల సమస్యలను అధికారికంగా వీలైనంతవరకూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వారి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాల కేటాయింపులో చిత్తశుద్ధితో వ్యవహరిస్తానన్నారు. ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా తన స్నేహితుడు శివరామ సుబ్రహ్మణ్యం ఆర్డర్ వేస్తే చాలని, తాను శిరసావహించి అమలు చేస్తానని చెప్పారు. ఇటీవల శివరామ సుబ్రహ్మణ్యంతో పాటు తాను ముఖ్యమంత్రిని కలిశానని, ఆ సందర్భంగా శివరామ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీగా నియమిస్తామని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యవైశ్య ప్రముఖులు వారణాసి గుప్తా, గ్రంధి నాగబాబు, తమ్మన సత్తిబాబు, కంచెర్ల వీరబాబు, పేకేటి దుర్గారావు, నేతి నానాజీ, చెక్కా కాశీ, బచ్చు రామకృష్ణ, దొండపాటి నగేష్, అనురాధ, యలమర్తి త్రినాథరావు, బలభద్ర నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యం

- దేవదాయ, ధర్మదాయ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్
- ఎంపీగా డాక్టర్ గూడూరిని, ఎమ్మెల్యేగా మార్గానిని గెలిపించాలని పిలుపు



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలసిన జ్వాలాపురపు శ్రీకాంత్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ, అభివృద్ధి, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, వారి అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. టీడీపీ బ్రాహ్మణ ద్వేషి అని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ బ్రాహ్మణులకు అత్యధిక స్థానాలు కేటాయించారన్నారు. రానున్న రోజుల్లో బ్రాహ్మణులకు అధిక సంఖ్యలో నామినేటెడ్ పదవులు కేటాయిస్తారన్నారు. 2019లో బ్రాహ్మణులకు 4 ఎమ్మెల్యే స్థానాలతో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లుగా, 18 కార్పొరేటర్ పదవులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సలహాదారులుగా ఆరుగురిని నియమించారని వివరించారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకొని, బ్రాహ్మణుల అభివృద్ధికి పాటు పడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, సిటీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మార్గాని భరత్‌రామ్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు కూడా ఉన్నారు.

ఈద్ ముబారక్



రాజమహేంద్రవరం నెహ్రూ నగర్ ఈద్గా మైదానంలో రంజాన్ సందర్భంగా ముస్లింలతో ప్రత్యేక ప్రార్థన చేయిస్తున్న షేక్ ఇమామ్ హాల్ హాజ్ మౌలానా అబ్దుల్ అఫీజ్ ఖాన్ రజ్వి

పవిత్ర రంజాన్ మాసంలో సాగించిన కఠోర ఉపవాస దీక్షల అనంతరం ఈదుల్ ఫిత్ర్ పండగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. పలు మసీదులు, ఈద్గా మైదానాల్లో సామూహికంగా ప్రత్యేక నమాజులు నిర్వహించారు. అనంతరం పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరుణ దాతృత్వాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ పండగ సందర్భంగా అల్లాహ్ కరుణతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. – సాక్షి, రాజమహేంద్రవరం

కాంగిరేసుపై కస్సుబుస్సులు

అమలాపురం టౌన్: డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం స్థానికంగా ఒక హోటల్‌లో జరిగిన జిల్లా కాంగ్రెస్ సమావేశం నిరసన సెగలతో సాగింది. అతిథులుగా పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్ చౌహాన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ ఎదుటే జిల్లా పార్టీ నాయకులు అధిష్టానంపై ధ్వజమెత్తారు. అమలాపురం, మండపేట తప్ప జిల్లాలోని మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో కొత్త వారికే టిక్కెట్లు ఇచ్చి ఏళ్ల తరబడి పార్టీకి సేవలు అందిస్తున్న సీనియర్లను విస్మరించారని విమర్శించారు. నాయకులు సర్దిచెప్పేందుకు చేసిన ప్రయత్నాలను సైతం తిప్పికొట్టారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు గౌతమ్, పద్మశ్రీ, జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు రాజీనామా చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో సమావేశం గందరగోళంగా తయారైంది. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్ ఆశించిన సీనియర్ నాయకురాలు ఇసుకపట్ల రాజేశ్వరీదేవి తదితరులు జిల్లాలో టిక్కెట్లు ఇచ్చిన విధానాన్ని తప్పు పడుతూ ఏఐసీసీ పరిశీలకుణ్ణి నిలదీశారు.

క్లుప్తంగా

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



సామర్లకోటలో రైలు ఢీ కొని మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని మూడవ నంబరు ప్లాట్‌ఫాం చివర రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం అలెప్పీ నుంచి ధన్‌బాద్ వెళుతున్న బోకారో ఎక్స్‌ప్రెస్ మూడవ నంబరు ప్లాట్‌ఫాంకు వస్తున్న సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి రైలుకు అడ్డుగా రావడంతో కుడి కాలు మోకాలు దిగువకు తెగిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని లోకో పైలట్ స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌కు సమాచారం ఇవ్వడంతో స్టేషన్ మేనేజర్ నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకొని రైల్వే పోలీసులు విచారణ ప్రారంభించారు. రైల్వే డాక్టర్, 108 సిబ్బంది క్షతగాత్రుడిని పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతుడు 35 సంవత్సరాల వయసు కలిగి, చామన ఛాయగా, 5'7 అడుగుల ఎత్తు ఉన్నాడని, గ్రే కలర్ ప్యాంట్, పచ్చపై తెలుపు పసుపు అడ్డు గీతలు కలిగిన హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి నల్లని కాశీ తాడు ఉందని, రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్సై బి.లోవరాజు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాల కోసం 94406 27562 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



కొత్తూరు సెంటర్‌లో సీజనల్ పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి



సీమచింత కాయలు, గులాబీ జామకాయలు



రామాఫలాలు

ఎండలు భగభగ.. అమ్మకాలు గబగబ

- జోరుగా సీజనల్ ఫ్రూట్స్ విక్రయాలు
- వినియోగదారుల్లో అమితాసక్తి
- వేసవిలో పెరిగిన డిమాండ్



జొన్నాడలో ఏర్పాటు చేసిన దుకాణంలో పుచ్చకాయలను విక్రయిస్తున్న వ్యాపారి

ఆలమూరు: వేసవికాలం ప్రభావంతో ఎండలు భగభగ మండుతున్నాయి. ఆరోగ్యాభిలాషుల ఆదరణతో మార్కెట్‌లో ఈ సీజన్‌లో లభించే వివిధ రకాల పండ్లకు డిమాండ్ అధికమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం మండలంలోని దివాన్‌చెరువు ప్రధాన కేంద్రంగా రావులపాలెం, అమలాపురం, కాకినాడ పట్టణాల్లో ఉప కేంద్రాల్లో సీజనల్ పండ్ల వ్యాపారం చురుగ్గా జరుగుతోంది. యాపిల్, డ్రాగన్, చెర్రీ, దానిమ్మ, ద్రాక్ష, కమలా ఫలాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానిక చిరు వ్యాపారులు ఆయా పట్టణాల్లోని హోల్‌సేల్ వర్తకుల నుంచి కొనుగోలు చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు రెండు టన్నుల మేర పండ్ల అమ్మకాలు సాగుతుండగా రూ.కోట్లలో టర్నోవర్ లభిస్తోంది. సీజన్‌లో మాత్రమే లభించే పుచ్చకాయ, సపోటా, రామాఫలం, గులాబీ జామ, సీమ చింతకాయలు, దోసకాయలు తదితర పండ్ల కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. శరీర దారుఢ్యానికి, ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్న వినియోగదారులు ఈ పండ్లను ధర ఎక్కువైనా కొనుగోలు చేసేందుకు వెనుకాడటం లేదు.

పోటెత్తిన పుచ్చకాయలు

వేసవిలో ఎక్కువగా తినే పుచ్చకాయలు మార్కెట్‌లోకి ఇప్పటికే పోటెత్తాయి. రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా ఈ దుకాణాలే కనిపిస్తున్నాయి. రంపచోడవరం, గోకవరం, ఏలేశ్వరం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో లభ్యమయ్యే రామాఫలాలను వ్యాపారులు తీసుకువస్తున్నారు. ఎరుపు, పసుపు రంగుల కలయికలో ఉండే రామాఫలంలో గుంజు మాత్రం సీతాఫలంలానే ఉన్నప్పటికీ పిండి పదార్థం ఎక్కువగా ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరమైన విటమిన్లు ఉండటంతో పాటు తియ్యగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే దొరికే వీటిని సైజును బట్టి డజను రూ.250 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని లంక భూముల్లోను, చాగల్నాడు ప్రాంతాల నుంచి సీమ చింతకాయలు తీసుకువచ్చి కిలో రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వీటికి మార్కెట్‌లో ప్రత్యేకమైన డిమాండ్ ఉంది. గోదావరి లంకల్లో ఈ సీజన్‌లో పండే దోసకాయలు, సపోటాలకు గిరాకీ ఉంది. సైజును బట్టి కాయ ఖరీదు రూ.40 నుంచి రూ.100 వరకు ఉంటుంది. చలువ చేసే వీటిని పంచదారలో కలుపుకుని తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. లంకల్లో దొరికే ఖర్బూజాలు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ. 30 వరకు ఉంటున్నాయి. కడియం ప్రాంతంలో దొరికే గులాబ్‌జామకాయలు డజను రూ.50 వరకు ఉంటున్నాయి. విజయనగరం, మన్యంలోని అల్లూరి జిల్లా నుంచి వచ్చే అనాస పండ్లు అతిచౌకగా లభిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోనూ విక్రయాలు

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో మాత్రమే లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ గ్రామీణ ప్రాంతాల్లోను లభ్య మవుతున్నాయి. సీజనల్‌గా దొరికే ఆయా రకాల పండ్లను నేరుగా పండించే ప్రాంతానికి వెళ్లి, కొనుగోలు చేసి సైకిళ్లపైనా తిరుగుతూ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. అరుదుగా లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్ ఇంటి ముంగిటే లభ్యకావడంతో గ్రామీణప్రాంత వాసులు సంబరపడుతున్నారు. స్థానికంగా లభించే కొన్ని పండ్లను కోసుకుని తింటే ఉండే మజా వేరనే అభిప్రాయాన్ని గ్రామీణులు వ్యక్తం చేస్తుంటారు. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అమితంగా ఉండి ఆరోగ్యానికి దోహదపడే సీజనల్ ఫ్రూట్స్‌పై అన్ని ప్రాంతాల వాసుల్లో ఆదరణ పెరుగుతుంది. జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూర, అంజీర తదితర డ్రైఫ్రూట్స్‌కు సీజన్‌తో నిమిత్తం లేకుండా విశేష ఆదరణ లభిస్తోంది.

పెరిగిన గిరాకీ



సీజనల్‌గా లభించే పండ్లను కొనుగోలు చేసేదుందుకు వినియోగదారులు అమితంగా ఇష్టపడుతున్నారు. సంవత్సరానికి కొన్ని రోజుల పాటు లభించే ఈ పండ్లు ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే వేసవిలో సీజనల్ ఫ్రూట్స్ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

– కాకి సత్యనారాయణ, పండ్ల వ్యాపారి, పినపళ్ల

భలే రుచి



సాధారణంగా వేసవి ప్రారంభంలో లభ్యమయ్యే సీజనల్ పండ్లు అత్యంత రుచికంగా ఉంటాయి. ఆరోగ్య సంరక్షణకు పండ్ల ధరలు ఎక్కువైనా కొనుగోలు చేయక తప్పడం లేదు.

– చిన్నం సత్యనారాయణ, వినియోగదారుడు, ఆలమూరు.

ఆరోగ్యానికి మంచివి



వేసవిలో లభించే సీజనల్ ఫ్రూట్స్‌లో అనేక పోషక విలువలు ఉంటాయి. వీటిని పరిమితంగా తీసుకుంటే మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతుంది. వేసవి దృష్ట్యా ఫ్రూట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఆర్.మల్లికార్జున్, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల

వైఎస్సార్ సీపీకి రెడ్డి సామాజిక వర్గం అండ

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు అవకాశవాద రాజకీయాలు అలవాటేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక అధికారం కోసం బీజేపీ, జనసేనతో అనైతిక పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. రెడ్డి వ్యతిరేకి చంద్రబాబు అని, టీడీపీ హయాంలో రెడ్లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గీయులను ద్వేషించే చంద్రబాబు తాను అధికారంలో ఉండగా తన సామాజిక వర్గం వారిని ప్రాధాన్యం కలిగిన ప్రభుత్వశాఖల్లో నియమించారన్నారు. ప్రాధాన్యం లేని పోస్టుల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించారని, ఇది నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉండగా రెడ్లను అన్ని రంగాల్లో అణిచివేసిందని, కాల్‌మనీ వ్యవహారంలో రెడ్డి సామాజిక వర్గీయులనే టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలిచారని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, ఈ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గీయులు ప్రత్యేక పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, వల్లభశెట్టి సతీష్, జీఎల్ రవిశంకర్, కొండేటి భీమేష్ పాల్గొన్నారు.

మా స్కూల్.. మా రూల్!

- జనసేన నేత పాఠశాలలో నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు



గొల్లప్రోలులో మాధురి పబ్లిక్ స్కూలు

గొల్లప్రోలు: నగర పంచాయతీలోని మాధురి ప్రైవేటు స్కూల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం రంజాన్ సెలవును గురువారం ప్రకటిస్తే బుధవారం ఆ స్కూల్‌కు సెలవు ఇచ్చేసి ఆరోజు జరపాల్సిన పరీక్షను వాయిదా వేసేశారు. తిరిగి రెండో రోజు గురువారం పరీక్ష నిర్వహించకుండా సెలవు ప్రకటించారు. ఎవరి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలకు సెలవు ప్రకటించి పరీక్షలు వాయిదా వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. స్కూల్ యజమాని కడారి తమ్మయ్యనాయుడు జనసేన నేత కావడంతోనే అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ 6వ తేదీ నుంచి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీసీఈబీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ జారీ చేసిన టైం టేబుల్ ప్రకారం బుధవారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో బుధవారం ఈ పరీక్ష నిర్వహించారు. మండల వనరుల కేంద్రం నుంచి డీసీఈబీ పరీక్షల పేపర్లు మాధురి స్కూల్ సిబ్బంది తీసుకొని వెళ్లినట్టు ఎమ్మార్పీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. యాజమాన్యం శుక్రవారం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించనున్నట్లు చెబుతోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్ష పేపర్లతో యాజమాన్యం పరీక్షలు నిర్వహిస్తోందా లేదా.. అనే అనుమానం విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజు క్రితమే అన్ని పాఠశాలల్లో రాసేసిన పేపర్లతో మూడవ రోజు పరీక్షలు రాయిస్తే ఇక అది పరీక్ష ఎలా అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. విషయమై డీవైఈవో ఆర్‌జేడీ రాజు వివరణ కోరగా మాధురి స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి జిల్లా విద్యాశాఖకు ఫిర్యాదు చేశామన్నారు. అలసత్వం వహించిన గొల్లప్రోలు మండల విద్యాశాఖాధికారులపైనా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కొండెవరంలో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ పేలి 3 తాటాకు ఇళ్లు దగ్ధం
- సుమారు రూ.17 లక్షల ఆస్తి నష్టం



అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

కొత్తపల్లి: కూలి పనికి వెళ్తేగాని కుటుంబం గడవని నిరుపేదలపై అగ్ని కన్నెర్ర జేసింది. మండలంలోని కొండెవరం గొల్లపేటలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలిన కారణంగా గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు, అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం మూడు తాటాకు ఇళ్లలో మెరుకుర్తి వెంకటరమణ, మెరుకుర్తి వీరస్వామి, మెరుకుర్తి సత్తిబాబు, మెరుకుర్తి చినసుర్యనారాయణ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వెంకటరమణ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో పక్కనే ఉన్న రెండు తాటాకు పాకలు క్షణాల్లో ఒకదాని తరువాత ఒకటి అగ్నికి ఆహుతయ్యాయి. పేలుడు శబ్దానికి స్థానికులు ఉలిక్కిపడ్డారు. పిఠాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సుమారు రూ.17 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులు బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించే నిత్యావసర వస్తువులను అందజేశారు.

దిండి టూరిజం కేంద్రం స్కాంలో ఐదుగురి సస్పెన్షన్

మలికిపురం: ప్రముఖ పర్యాటక కేంద్రం దిండి టూరిజం కేంద్రంలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఐదుగురు ఉద్యోగులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మేనేజరు ఫణీంద్రతో పాటు ఉద్యోగులు పసుపులేటి సత్యనారాయణ, పుల్లారావు, రాజు, దుర్గారావులను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కల్యాణోత్సవాలపై సమీక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్నట్లు దేవాదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవాలపై సమీక్ష ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కోడ్ ఉల్లంఘించారని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లిపై ఫిర్యాదు



ఏఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి గురువారం ఏఆర్‌ఓ సునీల్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి అసెంబ్లీ సీటు దక్కకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి న్యాయం కోసం నల్లమిల్లి అంటూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. రామకృష్ణారెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు, దూషణలు చేస్తున్నారన్నారు. ఆయనే స్వయంగా మాట్లాడిన ఆడియోతో తన ఎన్నికల ప్రచారానికి అనుమతి పొందిన వాహనాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే పరిస్థితి లేదన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సునీల్‌బాబుకు ఫిర్యాదు చేసినట్లు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఏఆర్‌ఓను కలిసిన వారిలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్‌ఎస్ తదితరులు ఉన్నారు.

అరుదైన చేప.. ఎగరడమే చేవ!



కాకినాడలో తూనీగ చేప



చేప పొడవాటి రెక్కలను చూపుతున్న మత్స్యకారుడు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలోని చేప పేరు తూనీగ.. ఈ చేప ప్రత్యేక ఏమిటంటే సముద్రపు నీటిలో ఈద గలదు. గాలిలో ఎగర గలదు. ఈ చేపలు గుంపులుగా సముద్రంలో ఎగురుతూ వెళుతుంటే నయనానందకరమే. నీటి పైనుంచి గాలిలో చాలాదూ రం ఎగరడంతో ఈ చేపలను తూనీగ అని పిలుస్తా రని మత్స్యకారులు చెబుతారు. గాల్లో ఎగిరేందుకు అనుగుణంగా వీటి రెక్కలు పొడవుగా ఉంటాయి.